

# అడుసు తొక్కిన మనిషి

గుత్తుల భాస్కరరావు

గదినిండా బెడ్‌లైటు బ్లూవెల్తురు పరుచుకుని ఉంది. తెరిచిన కిటికీలోంచి తెరల్ని తోసుకొచ్చిన గాలి సన్నజాజుల వాసన మోసుకొస్తుంది.

మంచానికి అవతలి అంచున పడుకున్న వసంతని "వసూ, నిద్రపోతున్నావా'' అన్నాడు కృష్ణమూర్తి.

''ఊహు" అంది మోచేతి మీద పైకిలేచి చూస్తే వసంతా తనవైపే చూస్తుంది. కనురెప్పలు చేపమొప్పల్లా కొట్టుకుంటున్నాయి.

ఒకరౌండ్ దొర్లి ఆమెదగ్గరకు జేరి ''నాకేం తోచడంలేదు వసూ" అన్నాడు.

''ఏంకావాలిట అయ్యగార్కి?''

"కమ్మటి కథ చెప్పు. వింటూవింటూ నిద్రపోతాను.''

''మన ఒప్పందం ప్రకారం ఈ రాత్రికి రాకాసిలోయలో రాకుమారుడి కథ చెప్పాను'' అంది వసంత.

''తప్పదంటావా!''

''అన్నమాటే '

కృష్ణమూర్తి ఆలోచనలో పడ్డాడు ఏంచెప్పాలా అని. ఏదో తోచింది. లేచి కూర్చుని ''ఈసారి కథకాదు, నా అనుభవం చెబుతాను" అన్నాడు.

"అలాగే కానివ్వండి." శేషతల్పశాయి మాదిరి పడుకొని వినడం మొదలు పెట్టింది వసంత.

"నా కాలేజీ రోజుల్లో హోటల్లో భోం చేసేవాణ్ని. ఆ వూరికి అదొక్కటే హోటల్ కావడంవల్ల నాలాంటి ఒంటి ప్రాణాలకి గత్యంతరం లేకపోవడంవల్ల ఆ హోటల్‌యజమాని నిరంకుశత్వాన్ని ప్రదర్శించేవాడు పప్పు గోంగూర పేరుతో పప్పులో పచ్చగడ్డి కలిపేవాడు రసం సాంబారు పేరుతో కాలకూటవిషం పోసేవాడు. నేటి బాలలే రేపటి పౌరు లన్నట్టు .. యివాళ్ళకూర మిగిలితే రేపు చట్నీగా అవతరించేది

"ఆ హోటల్‌యజమాని కౌంటర్‌లో గోళ్ళుతింటూ ఉండేవాడు. అతను భోం చెయ్యకుండా గోళ్ళుతింటూ సంపాదిం చాడు భోంచేసి కష్టాలు పడ్డది మేము," అంటూ ఆపాడు కృష్ణమూర్తి.

"బావుంది హోటల్ వ్యాఖ్యానం. కథ అయిపోయిందా?"

"ఆగు తొందరపడితే ఎలా? అసలు కథ యిక్కడ ఉంది. వాడు గడ్డిపెట్టినా కస్టమర్స్ విసుగుచెందని విక్రమా ర్కుల్లా నిలిచారు. ఆ తరువాత రెండు మూడు హోటల్స్ వెలిసినా దీని వసూళ్లు తగ్గలేదు బ్రహ్మచార్లు, ఫామిలీ పుట్టింటి కెళ్ళిన సంసార్లు... ఒకరేమిటి? .. ఏమీ తోచక భోజనానికొచ్చేవాళ్ళు .. చాలా మందితో హోటల్ రద్దీగా ఉండేది. దానికి కారణం ఏమిటో తెలుసా?"

"ఎవరు?"

"హోటల్‌వాడి కూతురు."

"ఏమిటీ! కూతురా? ఆ అమ్మాయి వడ్డించేదా?"

"అలావడ్డించినాబావుణ్ను. 'భోజనం తయారు' బోర్డుకట్టగానే అప్సరసలా తయారై ఆ హోటల్లోనే తచ్చాడేది వాళ్ల యిల్లూ హాలూ ఒకటేనేమో, ఎప్పుడూ భోజనాలహాల్లోనే తిరిగేది. నువ్వు ఏమీ అనుకోనంటే చెబుతాను అబ్బ ..ఆడ పిల్లకాదు..." అంటూ ఏమీ చెప్పలేక శూన్యంలోకి వ్యామోహంగా చూశాడు.

"ఆడపిల్ల కాకపోతే గాడిదపిల్లా?"

"నీ కలానే ఉంటుంది ఆమెనుచూస్తే ఆడవాళ్ళకే వెర్రిపుడుతుంది. పేరు సుందరి. నా ఫ్రెండొకడు 'ఆడది కాదు అల్సేషన్‌డాగ్' అనేవాడు. మనిషి తెల్లటి తెలుపు గొంతుకలో నీళ్ళుపోసు కుంటే కంఠంలో కనిపించేవి ఊరంత టికీ అందగత్తె ఏడు మల్లెపువ్వులెత్తు కూడాతూగదు."

"అంటే ఒక మల్లెపువ్వు ఈక్వల్స్ టు పది పన్నెండు పౌన్లా?"

"హాస్యం ఆడకు. ఆ ముక్కుండేది . ఆ డిజైను ముక్కు నూటికి కోటికి ఒక్కరికే ఉంటుంది. ఆమెని చూసి జనం వెర్రెత్తిపోయేవారు."

"యింతకీ ఏమిటి మీరు చెప్పేది?"

"వసూ, యింతవరకూ వచ్చాక అసలు విషయం దాచకూడదు. సుంద రిని నేను ప్రేమించాను."



వసంత ఒక్కక్షణం అదిరి మళ్ళీ మామూలుగా నవ్వేసింది "మీ మొహం మీరు ప్రేమించినా ఆ అమ్మాయి కంటి కౌసలతో కూడా చూసి ఉండదు."

''చూసింది వసూ సుందరి నేనంటే ప్రాణం యిచ్చేది నాకోసం అని ప్రత్యేకంగా అసలు నెయ్యి పంపేది! స్పెషల్ కూరలు పంపేది. దూరంగా ఉంటూ నా భోజనాన్ని కనిపెట్టుకొని ఉండేది."

''ఒకనాడు వాష్‌బేసిన్ దగ్గర చేతులు కడుక్కుంటుంటే నన్ను రమ్మని సైగచేసి డాబామెట్లుఎక్కి పైకి వెళ్ళింది. నేను ఎవరూ చూడకుండా...మెల్లగా డాబాపైకి వెళ్ళాను. నాకోసం విరబ్బూసిన గులాబీమొగ్గలా నిల్చుంది సుందరి. మల్లెదవనం కనకాంబరాల కాంబినేషన్‌తో తల కాంగ్రెస్ జెండాలా ఉంది. అన్నీ పూలే! అది తలకట్టుకాదు, పూలకొట్టు. బలే ముచ్చటగా ఉంది. 'మరి...యిక్కడికి ఎవరైనా వస్తే?' అని భయం వెలిబుచ్చాను. 'ఏమీ భయంలేదు ఈ డాబా పైన పాడుబడిపోయింది. ఎవరూ వాడ్డం లేదు' అంది. చొరవచేసి చేతులు పుచ్చుకున్నాను. ఆకులా అల్లాడిపోయింది 'సుందరీ నేనంటే ఎందుకింత అభిమానం. నాలో ఏంచూసావు?' అన్నాను. 'ఏదో చూసాను. అందుకే అంత యిష్టం. మీకెందుకీ కష్టాలు. మా

నాన్నగారి దిక్కుమాలిన హోటల్లో ఎన్నాళ్ళిలా భోంచేస్తారు' అన్నది. సుందరినన్ను త్వరలో గృహస్థుకావాలని కోరుతున్నట్టు అనిపించింది. అదీ తనతో.

'అంటే నన్ను ప్రేమిస్తున్నావా?'

'నానోటితో పలికించాలని పట్టుదలా?' తాంబూలం వేసుకుందేమో తెరచుకుంటున్న చిన్ననోరు ఎర్ర త్రికోణాన్ని గుర్తుచేసింది

'నేను అదృష్టంవంతుణ్ణి సుందరీ'

'నేనూ అంతే. జన్మజన్మలకీ మీరే నా భర్త' అంది ప్రతిరాత్రి హోటల్లో భోజనం అయిన వెంటనే డాబామీదికి ఎవరూ చూడకుండా రమ్మని...మాట తీసుకొంది. నేను డాబామీదికి వెళ్ళేసరికి కళ్ళలో జ్యోతులు వేసుకొని అభిసారికలా ఎదురుచూస్తుండేది. మేము చెప్పుకొన్న తియ్యటి కబుర్లు...గడిపిన శారద్రాత్రులూ లెక్కలేనన్ని అంత తియ్యటి అనుభూతులు ఎవరికీ కలిగిఉండవు...

"ఎందరెందర్నో ఏడిపించి, వడదెబ్బ కొట్టించి, కాల్చి బూడిదచేసిన సుందరి ...అందని ద్రాక్షగుత్తిలాంటి సుందరి నాకోసం అర్రులు చాచడం నాకే ఆశ్చర్యం కలిగించేది "

వసంత మౌనంగా విని "సుందరిని అంత యిదిగా ప్రేమించి పెళ్లెందుకు చేసుకోలేకపోయారు?" అంది.

కృష్ణమూర్తి మొహంలో కారు మేఘాలు అలుముకున్నాయి. "సుందరి ప్రతిసారి అనేది 'వయసులో ఉన్నాం. పెళ్ళిచేసుకొందాం' అని. నే ననేవాణ్ణి 'వయసుకేం తన్నుకుంటూ వస్తుంది. రావల్సింది కాళ్ళమీద నిలబడగలిగే స్తోమత. అది వచ్చింతరవాతే మన పెళ్ళి. అలా అని సుందరిని నా చేతులారా పోగొట్టుకొన్నాను. ఉద్యోగం, స్తోమత సంపాదించి సుందరికోసం ఆ ఊరు వెళ్ళేసరికి...ఆలస్యమై అంతా అయిపోయింది. చంటిబిడ్డతో కనిపించింది సుందరి

"అలా సుందరి అన్యాక్రాంతమై పోయింది నా హృదయంలో యింకిపోయి...స్మృతి మిగిల్చి వెళ్ళిపోయింది" అంటూ బాధగా అన్నాడు కృష్ణమూర్తి.


వసంత మొహంలో కృష్ణమూర్తికి సానుభూతి కనిపించింది.

"వసూ దాపరికం లేకుండా నా ప్రేమ కథ చెప్పాను. నేను ఒకే ప్రశ్న అడుగుతాను చెప్పు!"

"అడగండి."

"నువ్వు మన పెళ్ళికిముందు ఎవరైనా ప్రేమించావా?" వసంత ఉలిక్కిపడింది. లేచికూర్చొని "మీ కేమైనామతిపోయిందా ఏమిటా మాటలు?"

"పోనీ ఎవరైనా దృష్టిలో పెట్టుకోలేదా...అరె, నేనేమీ అనుకోను. చెప్పు నాకు చాలా యింట్రెస్టై." వసంతకి ఒళ్లు మండింది "బావుంది మీయింట్రెస్టు




కోసం ఎవడో ఒకణ్ని ప్రేమించినట్టు చెప్పుకోమంటారా."

"నాకున్న థ్రిల్ కూడా లేదు నీ జీవితానికి "

"చాలుగాని యిక నిద్రపోండి" అంటూ నవ్వుతూ ఒక్కదుప్పటీ కలబోసి కప్పింది వసంత.

* *

అది వసంతకు నిద్రపట్టని రాత్రుల్లో మూడోది. కనులు మూసుకొని ఎంత ప్రయత్నించినా నిద్ర గగనకుసుమమై పోయింది కృష్ణమూర్తి నిశ్చింతగా నిద్రపోతున్నాడు. 'మగమహారాజు' అనుకొంది జుగుప్సగా. అలా అనుకోడానికి నిద్రకి దూరమవడానికి కారణం అతని ప్రేమకథ. కారకురాలు సుందరి కళ్ళముందు వద్దనుకున్నా సుందరి రూపం మెదులుతూంది, కృష్ణమూర్తి ధోరణిలో. తెల్లటి తెలుపట. ఏడుమల్లె పువుల ఎత్తట. కంఠంలో సీళ్లుపోస్తే కనిపిస్తాయట. ముక్కు సంపెంగ మొగ్గట. సిగ్గులేదు వర్ణించడానికి. వసంతకి ఊహించేకొద్దీ వెగటు పుట్టింది.

సుందరేమిటి. వయసు వత్తిడికి యవ్వనంలో ఉన్న ప్రతి ఆడదీ మెరుస్తుంది. మెరవక చస్తుందేమిటి? అది బావుందని మంచివాడనుకొన్న ఈ మొగాడు ఎగబడ్డం ఏమిటి

డాబామీద చెప్పుకున్నకబుర్లు,గడిపిన శారద్రాత్రులు...ఊహించేకొద్దీ ఊహకందని దూరాలకి తీసుకుపోయి వసుంతకి దుఃఖం ముంచుకొచ్చింది

కృష్ణమూర్తి చెబుతున్నంతసేపూ ఎంతోనిగ్రహించుకొంది ఏడుపురాకుండా. విశాలహృదయం ఉన్న ఆడదానిలా నవ్వింది పైగా. ఎదురుగా ఏడ్చేస్తే అలుసయ్యే మాట నిజంగానీ...ఎలాదాచుకోవాలీ దుఃఖని.

కృష్ణమూర్తి ఉత్తముడు అనుకొంది గానీ తలలో ప్రేమకథ గందరగోళం ఉన్న మామూలు మగాళ్ళ జాబితాలోని వాడే. యిన్నాళ్ళు తనవైపు చూపిస్తున్న

ప్రేమ అనురాగం అంతా బూటకం. ఒక వేళ తనలో సుందరిని చూసుకొని యిష్టపడుతున్నాడేమోనన్న అనుమానం వచ్చి ఒళ్ళంతా కంపరం పుట్టింది వసంతకి 'ఛీ ఏం మొగాళ్లు' అనుకొంది, చాలా మంది ఆడవాళ్ళలా. అసలీమనిషి ఎందుకు ప్రేమించాలి..ప్రేమించిఎందుకు తెలియజెప్పాలి...చెప్పి తనలో బడబాగ్ని రగిలించాలి? మరో ఆడదైతే బట్టలు నాలుగూ సర్ది ఈపాటికి పుట్టింటికి పోయేది

వసంత ఏడుపు ఆపుకొని...మంచం దిగి...టేబిల్ ముందుకి నడిచింది. నర్సాపురంలో ఉన్న స్నేహితురాలికి ఉత్తరంవ్రాసి సుందరి గురించి వివరాలు సేకరించాలని, ఆ మహాతల్లి కాపురం సరిగా చేస్తుందో కాక తనభర్త నింకా కలవరిస్తుందో కనుక్కోవాలని సొరుగు లాగింది డ్రాయర్లో కృష్ణమూర్తి డైరీ కనిపించింది. దాన్ని చూడగానే ఎప్పుడూ లేని ఆలోచన కలిగి చదవాలనిపించింది 'ఏం తప్పేముంది నువ్వే నేను నేనే నువ్వు' అంటాడుగా అవసరమయినపుడు

డైరీలో సుందరి పేరుగానీ అడ్రెసుగానీ లేదు. కానీ రెండ్రోజుల క్రితం రాసిన దాంట్లో సుందరి పేరు కనిపించి వసంతకి గుండె దడదడ ఎక్కువయింది

జూలై 8 – 'ఇది ఊసుపోక తిన్నదరక్క చేసినపని. సుందరిలేదు సూడిదా లేదు. ఊహతో చక్కగా ఒక అపరంజి బొమ్మను కల్పించి, ఈవిడా నేను ప్రేమించుకొన్నాం. ఎంచగ్గా అని ఊరించి చెప్పాను వసంతకి చాలా నేచురల్‌గా. ఏడుపుమొహం పెడుతుందనుకొన్నాను. జెలసీ ఫీలవుతుందనుకొన్నాను అలిగి వేరే పడుకుంటుం దనుకున్నాను. బాప్ రే బాటరీలైటు పెట్టి వెతికినా మరో భావం దొరకలేదు నిర్మలంగా నవ్వింది. రేయ్ కృష్ణమూర్తి నువ్వు అదృష్టవంతుడివిరా.'

వసంతకు ఏడుపు నవ్వయింది. డైరీ మూసేసి సొరుగులో తోసింది. మంచం మీదకు గెంతి పడుకొంది. కృష్ణమూర్తి గాఢ సుషుప్తిలో ఉన్నాడు. బలిష్ఠమైన ఒక దోమ అతని బుగ్గమీద గుచ్చిగుచ్చి రక్తం తాగేస్తుంది. కసికొద్దీ బుగ్గమీద చరిచి దోమని చంపింది వసంత. అప్పటికీ నిద్రలేని కృష్ణమూర్తి ఒంటి చుట్టూరా చెయ్యి అల్లుతూ 'పాపిష్టిదాన్ని క్షమించరూ' అంది అతను మెలకువగా ఉంటే 'ఎందుకు' అని అడిగివుండేవాడు.

